క్లుప్తంగా

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందని ఇన్‌చార్జి తహసీల్దార్ వేమూరి మానస, ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. ఆయా గ్రామాల్లో సమస్యలు ఉంటే పరిష్కారం కోసం ప్రజలు అర్జీలు దఖలు చేసుకోవాలని, వచ్చిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు.

అన్నదానానికి రూ.15 వేలు విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పల్నాడు జిల్లా నిడుముక్కల గ్రామానికి చెందిన గడ్డిపాటి పద్మావతి కుటుంబసభ్యులు రూ.15 వేలను ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వత్సవాయి: మంగొల్లు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ బి.వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

వీరులపాడు: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని ఎస్ఐ అనిల్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్‌లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేర చరిత్ర కలిగిన వారిపై నిరంతర నిఘా ఉంటుందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఘర్షణలు, నేరాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక కార్యక్రమాలలో రౌడీషీటర్‌ల పాత్ర ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికైనా తీరు మార్చుకుని సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. అనంతరం నేరపూరిత చర్యలకు దూరంగా ఉంటామని వారితో ప్రతిజ్ఞ చేయించారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



పరిటాల(కంచికచర్ల): మండలంలోని పరిటాల గ్రామ సచివాలయం ఎదురుగా నేషనల్ హైవే పక్కన యద్దనపూడి బ్రదర్స్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఆ చలివేంద్రంలో గ్రామానికి చెందిన యద్దనపూడి రోజా పుట్టినరోజు సందర్భంగా ఆదివారం 500 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ప్రతి ఏడాది తన పుట్టినరోజు సందర్భంగా పేదలకు తమ వంతుగా సహాయ సహకారాన్ని అందజేస్తున్నానని రోజా తెలిపారు. కార్యక్రమంలో యద్దనపూడి ఏబేరమ్మ, రత్నకుమారి, ఇందిర, పింకీ, యద్దనపూడి గాంధీ, యద్దనపూడి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్‌లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి

నందిగామరూరల్: చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడి ఇబ్బందులు పడకుండా సత్ప్రవర్తనతో నడుచుకుంటూ కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవనం సాగించాలని సీఐ వైవీఎల్ నాయుడు అన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్‌లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రౌడీషీటర్‌లపై ప్రత్యేక నిఘా ఉంచామని హెచ్చరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా ఉపేక్షించేది లేదన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకుని మంచి నడవడికతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ అభిమన్యు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

జగ్గయ్యపేటఅర్బన్: పేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆదివారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశంలో పట్టణంలోని పలు అభివృద్ధి పనులు, పరిపాలనకు సంబంధించిన కేటాయింపులు తదితర 78 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం సిద్ధం చేసినట్లు తెలిపారు.

నకిలీ విత్తనాలతో జర జాగ్రత్త!

తొలకరి వర్షాలు పలకరించనున్న నేపథ్యంలో రైతులు ఖరీఫ్ వ్యవసాయ పనులకు సిద్ధం అవుతున్నారు. విత్తనాలు కొనేందుకు ఉద్యుక్తులవుతున్నారు. అయితే రైతులు ఈ సమయంలో విత్తన ఎంపికపై దృష్టి పెట్టాల్సి ఉంది. నాణ్యమైన విత్తనం వేసుకోకపోతే నష్టపోవాల్సి వస్తుంది. నకిలీ విత్తనాలతో మోసపోవద్దని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు.



దుకాణాల్లో పలు కంపెనీల విత్తనాలు

- విత్తన కొనుగోళ్లకు సన్నద్ధమవుతున్న రైతులు
- విత్తన ఎంపికపై జాగురూకత అవసరం
- నాణ్యమైన విత్తనం ఎంపిక ప్రధానం
- లైసెన్సు ఉన్న డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని అధికారుల సూచన

పెనుగంచిప్రోలు: నియోజకవర్గంలో ఖరీఫ్‌లో పత్తి, వరి, మిర్చి అధికంగా సాగు చేస్తారు. మిర్చి సాగు పశ్చిమకృష్ణాలోనే అధికంగా ఇక్కడ సాగవుతుంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో మిర్చి 6,900 హెక్టార్లు, పత్తి 7,800 హెక్టార్లు, వరి 7,300 హెక్టార్లలో సాగవుతుందని ప్రాథమిక అంచనా ఉందని వ్యవసాయ అధికారులు అంటున్నారు. అయితే ఈ ఏడాది మిర్చి సాగు తగ్గే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. రైతులు బీటీ-2 పత్తి విత్తనాలను ఎక్కువగా సాగు చేస్తారు. విత్తనాలు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. బీటీ విత్తనాల ప్యాకెట్ 475 గ్రాములది బీజీ 1 రూ.635, బీజీ 2 రూ.901కు విక్రయించాలని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ధర నిర్ణయించినా డీలర్లు మాత్రం అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు అంటున్నారు. అలాగే షిఫ్, అకేరా, జనని 555 వంటి రకాలకు డిమాండ్ ఉంది. అయితే డిమాండ్ ఉన్న రకాలను డీలర్లు బ్లాక్ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. విత్తనాలను లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. గుంటూరు, ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి గతంలో నకిలీ పత్తి విత్తనాలు వచ్చాయి. గతంలో ఓ ప్రముఖ కంపెనీకి చెందిన విత్తనాలు సాగు చేసి వత్సవాయి, పెనుగంచిప్రోలు, చందర్లపాడు మండలాల రైతులు దారుణంగా నష్టపోయారు. జిన్నింగ్ కంపెనీలో తీసిన పత్తి గింజలను తీసుకు వచ్చి కొందరు దళారులు తక్కువ ధరకు ఇచ్చి రైతులను మోసగిస్తారు. వీరి మాయలో రైతులు పడకూడదు. వరి విత్తనాలు కూడా లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలి. అసలు రైతులు సొంతగా విత్తనాలను తయారు చేసుకోవచ్చు. ముఖ్యంగా మిర్చి విత్తనాలు, నారు కొనుగోలు చేసే విషయంలో రైతులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయ శాఖ గుర్తించిన డీలర్ల వద్ద రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తే నష్టమొచ్చినా ప్రభుత్వం ఆదుకునే అవకాశం ఉంటుంది.

గతంలో నకిలీ విత్తనాలతో మోసపోయాం



గతంలో నకిలీ వరి, పత్తి విత్తనాలు సాగు చేసి నష్టపోయాం. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న విత్తనాలను డీలర్లు ప్రతి ఏడాది బ్లాక్ చేస్తున్నారు. విత్తనాలను రైతులకు ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా అందజేయాలి. పత్తి, మిర్చి విత్తనాల అమ్మకాలపై అధికారులు దృష్టి పెట్టాలి. గత ఏడాది బీటీ 2 పత్తి విత్తనాల ప్యాకెట్ రూ.864 ఉండగా ఈ ఏడాది రూ.901కి పెంచారు.

-కూచి శ్రీనివాసరావు, రైతు, వెంకటాపురం

లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి



తప్పనిసరిగా రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి. నర్సరీల్లో నారు కొనేటప్పుడు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. రైతులు ఎవరూ తక్కువగా వస్తున్నాయని ప్రైవేటు వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దు. ప్రైవేటు వ్యక్తులు అమ్ముతుంటే మా దృష్టికి తీసుకురావాలి. విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. రైతులు తప్పనిసరిగా వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.

-భవాని, ఏడీఏ, జగ్గయ్యపేట

పెనుగంచిప్రోలులో ట్రాఫిక్ కష్టాలు



విజయవాడ రోడ్డు వైపు నిలిచిపోయిన వాహనాలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో శ్రీతిరుపతమ్మ వారి ఆలయానికి భక్తులు వేలాదిగా వందల సంఖ్యల వాహనాలతో తరలి రావటంతో ఆదివారం గ్రామంలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. సెలవు దినాలు కావటంతో పాటు మొక్కులు తీర్చుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వారి వాహనాలతో గ్రామంలో అన్ని రోడ్లు నిండిపోయాయి. పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి ఆలయం వరకు, చెరువుకట్ట, డౌన్ సెంటర్, మునేరు కాజ్‌వే నాలుగు రోడ్లలో వాహనాలు నిలిచిపోవటంతో ట్రాఫిక్ నియంత్రించేందుకు పోలీసులు ప్రత్యేకంగా బందోబస్తు నిర్వహించారు. పోలీసులతో పాటు వాహనదారులు కూడా ట్రాఫిక్ నియంత్రణలో పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్ రద్దీ కొనసాగింది.

యోగాను దైనందిన జీవనంలో భాగంగా చేసుకోవాలి



నందిగామ ఆర్డీవో కార్యాలయంలో యోగాసనాలు వేస్తున్న ఆర్డీవో, సిబ్బంది

నందిగామరూరల్: యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవనంలో నిత్యకృత్యం చేసుకోవాలని ఆర్డీవో బాలకృష్ణ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంప్లాయిస్ థీమ్‌లో భాగంగా ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం యోగా కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. వత్తిడి, ఆందోళనతో పాటు నిత్య జీవితంలో ఎదుర్కొనే అనారోగ్య సమస్యలకు యోగాతో పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం యోగా గురువు సంగెపు సుధాకర్ ఆర్డీవో, సిబ్బందితో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌బాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ చేసిన ఎమ్మెల్యే



పశుపోషకులకు పశువుల దాణా అందజేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేటఅర్బన్: రైతు శ్రేయస్సే ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో ఆదివారం పశువుల దాణా 50 శాతం సబ్సిడీపై నియోజకవర్గంలోని 500 మంది రైతులకు ఒక్కొక్కరికి 50 కిలోల చొప్పున ఎమ్మెల్యే తాతయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. రాబోయే కాలంలో ఈ అవకాశాన్ని పశు పోషకులు ఉపయోగించుకొని అత్యధిక పాల దిగుబడిని పొందాలని సూచించారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ భవానీ ప్రసాద్, పశు వైద్యులు లక్ష్మీప్రసన్న, శ్రీనునాయక్, మురళీకృష్ణ, కూటమి నాయకులు రావూరి శ్రీను, గుమ్మ వెంకటేష్, పశుపోషకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధురంగా సాగిన చిత్ర గీతాలాపన



మాట్లాడుతున్న విజయలక్ష్మి, వేదికపై గౌస్, డేవిడ్‌రాజు తదితరులు

విజయవాడకల్చరల్: గీత్ సంగీత్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళా వేదికపై ఆదివారం సయ్యద్ గౌస్ బృందం నిర్వహించిన హిందీ, తెలుగు చిత్ర గీతాలాపన కార్యక్రమం మధురంగా సాగింది. హిందీ చిత్ర గీతాలను సయ్యద్ గౌస్, కిశోర్‌కుమార్, రఫీ ఆలపించారు. తెలుగు చిత్ర గీతాలను టీఎస్ రెడ్డి, ప్రిన్స్, అంజు స్వామి, సీతాదేవి, రేష్మ, మల్లీశ్వరి, రామభద్రకుమార్‌లు ఆలపించారు. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు మాట్లాడుతూ గాయనీ గాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. గాయకుడు గౌస్‌కు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ సాంస్కృతిక సంస్థలు ప్రజా సేవలో భాగస్వాములు కావాలని సూచించారు. వివిధ సంస్థల ప్రతినిధులు సీహెచ్ చిట్టిబాబు, ప్రసూనా రామన్ తదితరులు పాల్గొన్నారు.

అహల్యాబాయ్ సేవలు ఎనలేనివి

నందిగామ రూరల్: దేవాలయాల పరిరక్షణకు అహల్యాబాయ్ హోల్కర్ ఎనలేని సేవలందించారని బీజేపీ సహ సంఘటన రాష్ట్ర మంత్రి మధుకర్ అన్నారు. అహల్యాబాయ్ జయంతి ఉత్సవాలలో భాగంగా మండలంలోని మునగచర్ల గ్రామంలో ఆదివారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహల్యాబాయ్ ఆలయాల పరిరక్షణ, పునరుద్ధరణకు చారిత్రాత్మక సేవలందించారని తెలిపారు. అనంతరం ప్రధాన మంత్రి మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ప్రజలకు వినిపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తొర్లికొండ సీతారామయ్య, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పేద విద్యార్థిని ఆపరేషన్ నిమిత్తం ఆర్థిక సహాయం

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని క్రిస్టియన్ పేటకు చెందిన పేద బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి పాశం రామానుజమ్మ అనారోగ్యానికి గురై చెవికి ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మున్సిపల్ కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ ఆదివారం తన కార్యాలయంలో రూ.5 వేలు విద్యార్థినికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి శీలం మంగారావు, పట్టణ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు గంగోలు వినోద్‌కుమార్, పట్టణ ప్రచార కమిటీ అధ్యక్షుడు గోగుల వెంకయ్య, పట్టణ కమిటీ కార్యదర్శి దార్ల ప్రసన్నకుమార్, క్రిస్టియన్‌పేట మహిళలు పాల్గొన్నారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం పలువురు కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడ యనమలకుదురుకు చెందిన శ్రీహనుమాన్ నృత్య కళా నిలయానికి చెందిన 14 మంది చిన్నారులు తమ నృత్య ప్రతిభను చాటారు. నృత్యాచార్య కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. అనంతరం శిష్య బృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు.

సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాలి

విజయవాడకల్చరల్: సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాలని మేజర్ కొత్తా సుబ్రహ్మణ్య శాస్త్రి అన్నారు. శ్రీ దుర్గా అమ్మవారి విశ్వజననీ భక్తజన సంఘం ఆధ్వర్యంలో దుర్గాపురంలోని జీవీఆర్ సంగీత కళాశాలలో ఆదివారం సంప్రదాయ నృత్యపోటీలు, భక్తి గీతాలాపన పోటీలు, ఏకపాత్రాభినయం పోటీలను నిర్వహించారు.

అపూర్వ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

భీమవరం(వత్సవాయి): గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2010–11 లో పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. పదిహేనేళ్ల తర్వాత తొలిసారిగా కలుసుకున్న వారు ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి మధుర స్మృతులను నెమరువేసుకుని ఆనందడోలికల్లో మునిగిపోయారు. ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు వీరాస్వామి, భాను, రమణనాయక్, ఫణిశ్రీ, పూర్ణిమ, స్వర్ణలత, ఎస్ శ్రీనివాసరావు, రాంబాబు, షరీఫ్, సత్తార్‌లను సన్మానించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు వాటర్‌కూలర్‌ను వితరణగా అందజేశారు. తమ బ్యాచ్‌లో స్నేహితులు ఎవరన్నా ఇబ్బందులకు గురైతే వెంటనే సాధ్యమైనంతవరకు వారిని ఆదుకోవాలని తీర్మానించుకున్నారు.

రేషన్ వాహనాల రద్దును పునఃసమీక్షించాలి



మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేటఅర్బన్: రేషన్ వాహనాల రద్దును రాష్ట్ర ప్రభుత్వం పునః సమీక్షించాలని వైఎస్సార్ సీపీ నియోజవకర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కేవలం వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారనే దుగ్ధతో ఆయన ప్రవేశపెట్టిన విప్లవాత్మక సంస్కరణలను జీర్ణించుకోలేక కోట్లాదిమంది పేదలకు సేవలందిస్తున్న ఎండీయూలపై విషం చిమ్ముతూ ఆ వ్యవస్థకు మంగళం పాడారని మండిపడ్డారు. అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని చెప్పి ఎండీయూ వాహనాలను ఆపివేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రేషన్ షాపుల్లో అక్రమాలపై 6 ఏ కేసులు పెడుతున్నారు కదా వాటిని కూడా మూసివేస్తున్నారా...భవిష్యత్‌లో రేషన్ దుకాణాలను కూడ ఎత్తివేయాలని చూస్తున్నారా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీద ఉన్న కోపాన్ని, కక్ష సాధింపులను పేద ప్రజల మీద చూపిస్తే సహించమన్నారు. నెలకు కేవలం రూ.25 కోట్లతో నిర్వహించే ఎండీయూ వ్యవస్థను ఆర్థిక భారంగా పరిగణిస్తూ కూటమి ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందని, కానీ తమ వారికి మాత్రం కోట్ల విలువ చేసే భూములను 99 పైసలకే అప్పనంగా ముట్టచెబుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో 1.45 కోట్ల మంది కార్డుదారులు ఉంటే వారిలో అత్యధికులు రోజువారీ కూలి పనులు చేసుకొని జీవించే వారేనని, వారంతా రూ.300 నుంచి రూ.500 రోజుకూలీని నమ్ముకుని జీవనం సాగిస్తుంటారని తెలిపారు. వీరిలో సగటున కోటి మంది రేషన్ తీసుకోవడానికి డిపోకు వెళితే ఆ రోజుకు పనికి దూరం కాక తప్పదన్నారు. అంటే ఒక నెలలో ప్రభుత్వం ఇచ్చే రేషన్ తీసుకోవడానికి పేదలు రూ.300 కోట్ల నుంచి రూ.500 కోట్లు నష్టపోవాల్సిన పరిస్థితి తీసుకువచ్చారని స్పష్టం చేశారు. గతేడాది కృష్ణాలో వరదలు వస్తే ఈ ఎండీయూ వాహనాల ద్వారానే ప్రజలకు నిత్యావసర సరుకులు అందజేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలు అన్నీ చూస్తూనే ఉన్నారని, పేదవారి ఉసురు తప్పకుండా తగులుతుందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ నాయకులు, అనుబంధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామారావు, పక్కన వైఎస్సార్ సీపీ నాయకులు

పెనుగంచిప్రోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో అరాచక పాలన రాజ్యమేలుతోందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు అన్నారు. ఆదివారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం, తంగెడ గ్రామంలోని బీసీ సామాజిక వర్గానికి చెందిన ఉప్పుతోళ్ల హరికృష్ణ పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణంగా ఉందన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. దాచేపల్లి పోలీసులు చేసిన దుర్మార్గం రాష్ట్రంలో ఎమర్జెన్సీని తలపిస్తోందన్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే వారిపై హింసకు పాల్పడటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. హరికృష్ణపై థర్డ్ డిగ్రీ ఉపయోగించి దాన్ని సమర్థించుకునేందుకు ఒక కట్టు కథ అల్లుతున్నారన్నారు. టీడీపీ నేత కారులో హరికృష్ణను తరలించి స్టేషన్‌లో కొట్టి సీఐ క్వార్టర్‌లో దాచి పెట్టారన్నారు. ఈ అంశాన్ని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చేని రాంబాబు, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు దేరంగుల శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్ నలబోతు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈతలో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ల అందజేత



ఈతలో శిక్షణ పొందిన బాలబాలికలు, మహిళలతో డ్రీమర్ స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణానికి చెందిన డ్రీమర్ స్విమ్మింగ్ అసోసియేషన్, జగ్గయ్యపేట వారు పట్టణ సమీపంలోని పాలేరు నదిలో నిర్వహించిన వేసవి సెలవుల ఉచిత ఈత శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కోచ్ పొట్టబత్తిన పాండురంగారావు మాట్లాడుతూ ఈ ఉచిత ఈత శిక్షణలో కొత్తగా 78 మంది బాలబాలికలు, మహిళలు పాల్గొన్నట్లు తెలిపారు. మొదటి విడతగా 25 మందికి సర్టిఫికెట్లను గౌరవ అతిథి డాక్టర్ సామినేని దీపక్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. శిక్షణ పొందిన వారికి ఉపాధ్యాయుడు పర్చా లక్ష్మణ్, అసోసియేషన్ కోఆర్డినేటర్ యలదండి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు కూరపాటి సరితాదేవి, గంధం రాంబాబు, తుమ్మడపు నారాయణ శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కలాలి నరేష్, అడ్డగొట్టం రమేష్‌బాబు అదనపు కోచ్‌లుగా వ్యవహరించారు. స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మందడపు శ్రీనివాసరావు, టీమ్ మేనేజర్ అన్నంనీడి కల్యాణ్, కోశాధికారి పరిణయం రమాదేవి పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం



పేట గ్రంథాలయంలోని సమ్మర్ క్యాంప్‌లో మ్యూజికల్ చైర్స్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు



కంచికచర్ల శాఖా గ్రంథాలయంలో డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్-1 స్థాయి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆదివారం విద్యార్థులకు కథల పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం, పుస్తక సమీక్ష తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ ఛత్రపతి శివాజీ చరిత్రను విద్యార్థులకు వివరించారు. యోగా టీచర్ డి.రామలక్ష్మీపతి మెడిటేషన్, యోగాసనాలను చేయించారు. చివరిగా విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రమేష్, రాము పాల్గొన్నారు.

గ్రంథాలయాలు పుస్తక భాండాగారాలు

కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. డ్రాయింగ్ టీచర్ నీలం సర్వేశ్వరరావు మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. ఇంగ్లిష్ భాషలో మెలకువలు, డ్రాయింగ్ నేర్చుకోవాలని, పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు చెస్, డ్రాయింగ్, ఇంగ్లిష్‌ను నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు, క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, విద్యార్థులు పాల్గొన్నారు.